www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 6 సెప్టెంబరు 2023

పలువురు ఉన్నతాధికారులు బదిలీ

డిఆర్‌ఒగా ఉదయభాస్కర్ నియామకం
తాడేపల్లిగూడెం ఆర్‌డిఒగా పి.చెన్నయ్య
హౌసింగ్ జిల్లా మేనేజర్‌గా కె.ఝాన్సీలక్ష్మి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలోని పలువురు ఉన్నతాధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం డిఆర్‌ఒగా పని చేస్తున్న కృష్ణవేణిని బదిలీ చేసింది. ఆమె స్థానంలో జె.ఉదయభాస్కర్‌ను నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది. కొత్తగా ఏర్పడిన తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్‌కు ఆర్‌డిఒగా పి.చెన్నయ్యను నియమించింది. గృహనిర్మాణశాఖ జిల్లా మేనేజర్‌గా కె.ఝాన్సీలక్ష్మిని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

20 లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తాం

- ఉండి ప్రజలను గుండెల్లో పెట్టుకుంటా
- భీమవరానికి పట్టిన కేన్సర్ గడ్డ ఎంఎల్‌ఎ గ్రంధి
- గోదావరి జిల్లాల ప్రజల కన్నీటిని తుడిచే బాధ్యత తీసుకుంటా
- బహిరంగ సభలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్
- భీమవరం ప్రకాశం చౌక్‌లో ఫ్లెక్సీ రగడ

పాదయాత్రలో అభివాదం చేస్తున్న లోకేష్

ప్రజాశక్తి - భీమవరం, భీమవరం రూరల్

'జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదు.. 2.30 లక్షల ఉద్యోగాలు కల్పించ లేదు.. ప్రతియేటా 6,500 పోలీసు ఉద్యోగాలు ఇవ్వలేదు.. మెగా డిఎస్‌సి లేదు.. వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏదీ అమలు చేయలేదు.. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతియేటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం' అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. రాష్ట్రంలో పెండింగులో ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, ప్రభుత్వ ప్రయివేట్, స్వయం ఉపాధి ద్వారా ఏడాదిలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 205వ రోజు మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు భీమవరం శివారు నరసింహాపురం నుంచి ప్రారంభమైంది. ఉండి రైల్వే గేట్, మల్టీప్లెక్స్, బొంబే స్వీట్ సెంటర్, అంబేద్కర్ సెంటర్ వరకూ సాగింది. అక్కడ లోకేష్‌ను గజమాలలతో సత్కరించారు. అనంతరం పాదయాత్ర ప్రకాశం చౌక్‌కు చేరుకోగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేష్ ప్రసంగించారు. టిడిపి కంచుకోట పశ్చిమగోదావరి జిల్లా అని అన్నారు. రెచ్చగొట్టే ఫ్లెక్సీలు పెడుతున్నారని, మేము ఫ్లెక్సీలు వేయడం మొదలుపెడితే జగన్‌కు గుండెపోటు వస్తుందన్నారు. అబ్బాయులు కిల్ల్ బాబాయ్ అంటూ ఫ్లకార్డులు లోకేష్ బహిరంగ సభలో ప్రదర్శించారు. ఇసుక లేకుండా చేసి భవన నిర్మాణ కార్మికులకు, పరిశ్రమలు తరిమేసి యువతకు, ఆక్వా రంగాన్ని నాశనం చేసి ఆక్వా రైతులకు హాలిడే ఇచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. జగన్ పాలనలో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులతో రైతులు నష్టపోతున్నారని చెప్పారు.

పశ్చిమ అంటే చంద్రబాబుకు అపార ప్రేమ

పశ్చిమగోదావరి జిల్లా అంటే చంద్రబాబుకు అపారమైన ప్రేమ అని లోకేష్ అన్నారు. 2014లో 15కి 15 సీట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజలు టిడిపికి కట్టబెట్టారని గుర్తు చేశారు. సబ్సిడీలు, రాయితీలు ఇచ్చి ఆక్వా రంగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించి దేశంలోనే నెంబర్ వన్‌గా చేశామన్నారు.

ఉండి ప్రజలను గుండెల్లో పెట్టుకుంటా

ఉండి నియోజకవర్గం టిడిపి అడ్డా అని, జగన్ మాటలు నమ్మకుండా 2019లోనూ మంతెన రామరాజుని గెలిపించారని, తాను ఉండి ప్రజలను గుండెల్లో పెట్టుకుంటానని లోకేష్ అన్నారు. ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన టిడిపేనని, అప్పటి ఎంఎల్‌ఎ శివ చంద్రబాబు సహకారంతో రూ.1100 కోట్లతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. తాము అధికారం చేపట్టిన వెంటనే ఆకివీడు నగర పంచాయతీలో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఉండి సెంటర్‌లో ఉన్న బ్రిడ్జి కొత్త బ్రిడ్జి నిర్మిస్తామన్నారు. కోపల్లె బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని, మోగల్లు, కోరుకొల్లు గ్రామంలో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగు నీరందిస్తామని చెప్పారు. కిడ్నీ బాధితుల కోసం నియోజకవర్గంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు.

భీమవరానికి పట్టిన కేన్సర్ గడ్డ.. ఎంఎల్‌ఎ గ్రంధి

టిడిపి హయాంలో భీమవరాన్ని సుమారు రూ.1500 కోట్లతో అభివృద్ధి చేశామని లోకేష్ అన్నారు. 8250 టిడ్కో ఇళ్లు నిర్మించారన్నారు. ఎంఎల్‌ఎ గ్రంధి తన ఇంటి ముందు రోడ్డు తప్ప నియోజకవర్గంలో ఎక్కడైనా రోడ్డు వేశారా అని ప్రశ్నించారు. కనీసం రోడ్లపై గుంతలు పూడ్చలేని ఎంఎల్‌ఎ భీమవరానికి అవసరమా అని ప్రశ్నించారు. భీమవరానికి పట్టిన కేన్సర్ గడ్డ గ్రంధి శ్రీనివాస్ అని ఘాటుగా విమర్శించారు. సొంత పార్టీ నేతలే గ్రంధి అవినీతి గురించి సిఎంకు ఫిర్యాదు చేశారన్నారు. సెంటు స్థలం పేరుతో తక్కువ ధరకు భూములు కొని ఎక్కువ ధరకు ప్రభుత్వానికి అమ్మేశారని ఆరోపించారు. భీమవరం మండలం గొల్లవానితిప్ప, దొంగపిండి ప్రాంతంలో వందల ఎకరాల అసైన్డ్ భూముల్లో అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వారన్నారు. భూదందాలను బయటపెట్టిన సొంతపార్టీ నాయకులపైనే కేసులు పెట్టించిన ఘనుడు ఎంఎల్‌ఎ గ్రంధి అని ఆరోపించారు.

మిషన్ గోదావరి ప్రకటిస్తా

తన పాదయాత్ర ఉభయగోదావరి జిల్లాలు దాటేలోపు మిషన్ గోదావరి ప్రకటించి అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తానని నారా లోకేష్ ప్రకటించారు. భీమవరానికి మోడరన్ డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తామన్నారు. రింగ్ రోడ్డు ఏర్పాటు చేసి భీమవరాన్ని మోడల్ టౌన్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. శివారు ప్రాంతాలకు రోడ్లు, విద్యుత్, మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, ఉండి, పాలకొల్లు ఎంఎల్‌ఎలు మంతెన రామరాజు, నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రులు పత్తిపాటి పుల్లారావు, కెఎస్.జవహర్, మాజీ ఎంఎల్‌ఎలు బండారు మాధవనాయుడు, వేటుకూరి వెంకట శివరామరాజు, మాజీ జెడ్‌పి ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, కొళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం యాత్ర పట్టణంలోని ప్రధాన కూడళ్ల గుండా సాగి పట్టణ శివార్లోని తాడేరు వద్ద ఏర్పాటు చేసిన శిబిరానికి చేరింది.

ఫ్లెక్సీ వివాదం

యువగళం పాదయాత్రలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. భీమవరం ప్రకాశం చౌక్‌లో యనమదుర్రు గట్టుపై పేదలకు పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధం అని వైసిపి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ దగ్గర వివాదం తలెత్తింది. ఫ్లెక్సీ వద్ద పోలీసులు ముందుగానే బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీ చించేందుకు వచ్చారని పోలీసులు యువగళం వాలంటీర్లను అడ్డుకున్నారు. దీన్ని వాలంటీర్లు ప్రతిఘటించారు. బాబాయిని ఎవరు చంపారు అని రాసిన ఫ్లెక్సీలను యువగళం వాలంటీర్లు ప్రదర్శించారు. ఈ నేపథ్యంలో టిడిపి కార్యకర్తలు వైసిపి ఫ్లెక్సీపై రాళ్లు రువ్వి తారాజువ్వలను ఫ్లెక్సీపైకి వేశారు. ఈ క్రమంలో పోలీసులు, టిడిపి కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుని ఉద్రిక్త ఏర్పడింది. వన్‌టౌన్ సిఐ అడబాల శ్రీనివాస్, టూటౌన్ సిఐ గుత్తుల శ్రీనివాస్, రూరల్ సిఐ నాగప్రసాద్ వైసిపి ఫ్లెక్సీ ప్రాంతానికి ఎవరూ రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

రణరంగంగా భీమవరం

కర్రలు, రాళ్లతో వైసిపి, టిడిపి పరస్పర దాడులు

పోలీసులతో పాటు పలువురికి గాయాలు

గాయపడిన కానిస్టేబుల్

వైసిపి కవ్వింపు చర్యలతో లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో మంగళవారం రాత్రి తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. వైసిపి, టిడిపి శ్రేణుల పరస్పరం రాళ్ళ రువ్వుకుంటూ కర్రలతో బాహాబాహీకి దిగడంతో పలువురు పోలీసులతో పాటు టిడిపి, వైసిపి కార్యకర్తలు, స్థానికులు గాయాలయ్యాయి. బహిరంగ సభలో లోకేష్ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహానికి లోనైన వైసిపి శ్రేణులు తాడేరు టోన్‌షిప్ వంతెన వద్దకు పెద్దసంఖ్యలో చేరుకున్నాయి. అయితే పాదయాత్ర అక్కడికి చేరుకోక ముందే వారిని నిలువరించడంలో పోలీసులు విఫలమయ్యారు. సుమారు గంట అనంతరం యాత్ర తాడేరు వంతెన వద్దకు చేరుకోగానే వైసిపి శ్రేణులు రాళ్ళ దాడికి దిగారు. దీనికి ప్రతిగా యువగళం వాలంటీర్లు రాళ్లు రువ్వడంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలోనే ఇరుపక్షాలు కర్రలతో పరస్పర దాడికి దిగాయి. దీన్ని ఆపడానికి ప్రయత్నించిన ఐదుగురు కానిస్టేబుళ్లు, ఉండి మాజీ ఎంఎల్‌ఎ శివ, టిడిపి నేత పృథ్వితో పాటు ఇరు పక్షాల్లో పలువురికి గాయాలయ్యాయి. కొద్దిసేపటి అనంతరం పాదయాత్ర అక్కడి నుంచి ముందుకు వెళ్లిపోవడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా ఉండాలి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ఉత్తమ ఉపాధ్యాయినిని సత్కరిస్తున్న మంత్రి కారుమూరి, కలెక్టర్ ప్రశాంతి, ఎంఎల్‌ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు మార్గదర్శకులుగా ఉండాలని, వారి పిల్లలు ఏ రంగంలో రాణిస్తారో ముందుగా తెలియజేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడారు. గురువులు చేసిన త్యాగానికి, సేవలను సమాజం ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటుందని తెలిపారు. గురువులు నేర్పిన విద్య కారణంగా నేడు ఎంతో మంది విద్యార్థులు సమాజంలో ఐఎఎస్‌లుగా, ఐపిఎస్‌లుగా, ఇంజినీర్లు, డాక్టర్లు, రాజకీయ నాయకులుగా ఎదుగుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యా బోధనతో సమాజంలో మార్పు తెచ్చి సమసమాజ స్థాపనకు కంకణబద్ధులు కావాలని తెలిపారు. ముఖ్యమంత్రి విద్యారంగంలో తెచ్చిన మార్పుల కారణంగా మన రాష్ట్రం విద్యలో దేశంలో మూడో స్థానంలో నిలిచిందన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ మన ప్రతిభను పరిచయం చేసే గొప్ప వ్యక్తులు ఉపాధ్యాయులన్నారు. విజ్ఞానానికి మారుపేరు గురువు అన్నారు. మాజీ భారత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ గురువుగా విద్యాభివృద్ధికి చేసిన సేవలు ఆదర్శనీయమన్నారు. అంకిత భావంతో విద్యాభివృద్ధికి సర్వేపల్లి రాధాకృష్ణ విశిష్ట సేవలందించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అవసరమైన వినూత్నమైన ప్రణాళికలను రూపొందిస్తోందన్నారు. ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా విధానంలో ప్రతిష్టాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు. డిఇఒ ఆర్.వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసిందన్నారు. కార్పొరేట్ విద్యార్థులతో పోటీపడేలా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లను అందజేసిందన్నారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా 52 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి సన్మానించారు. వాటిలో 27 జిల్లాస్థాయి అవార్డులు, 4 సెంటా అవార్డులు, 20 అప్రిసియేషన్ అవార్డులు ఉన్నాయి. ఉపాధ్యాయులను మంత్రి నాగేశ్వరరావు, కలెక్టర్, ఎంఎల్‌ఎ మెమెంటోలు, ప్రశంసాపత్రాలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.జగపతిరాజు, డిఎంహెచ్‌ఒ డి.మహేశ్వరరావు, డిప్యూటీ డివైఇఒ శ్రీరామ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇల్లు కట్టుకోకపోతే పట్టా రద్దు

నోటీసులతో లబ్ధిదారుల ఆందోళన

వీరవాసరంలో నోటీసులు చూపుతున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రభుత్వం కేటాయించిన జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులకు కేటాయించిన స్థలంలో ఇళ్లు నిర్మించుకోకపోతే ఇంటి పట్టా రద్దు చేస్తామంటూ ఆర్‌డిఒ పేరున వచ్చిన నోటీసుల పట్ల లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనువుకాని చోట ఇంటి స్థలాన్ని కేటాయించి ఇళ్లు కట్టుకోమంటే ఎలా అంటూ వారు వాపోతున్నారు. ఈ మేరకు మంగళవారం లబ్ధిదారులు అందుకున్న నోటీసులతో తహశీల్దార్ ఎం.సుందరరాజును కలిశారు. వీరవాసరానికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న బాలేపల్లికి కిలోమీటరు దూరంలో వ్యవసాయ ప్రాంతంలో వీరవాసరం, మెంటేపూడి, దూసనపూడి గ్రామానికి చెందిన కొంతమంది లబ్ధిదారులకు జగనన్న లేఅవుట్ వద్ద ఇంటి స్థలాన్ని కేటాయించారు. అయితే ఆ ప్రాంతంలో ఇంటిని నిర్మించుకుంటే బతుకుతెరువుకు ఇబ్బందవుతుందంటూ లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకు రాని పరిస్థితి. కొద్ది నెలల క్రితం కలెక్టర్ ఆ ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. అయితే లబ్ధిదారుల అభిప్రాయాన్ని పరిణిలోకి తీసుకోకుండా తాజాగా అధికారులు ఇంటిని నిర్మించుకోకపోతే రద్దు చేస్తామంటూ నోటీసులు ఇవ్వడంతో సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియని స్థితిలో ఉన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన కొంతమంది అధికారుల నిర్వాకం వల్ల గ్రామానికి దూరంగా ప్రభుత్వం ఇంటి స్థలాలను కొనుగోలు చేసింది. ప్రస్తుతం ఆ ప్రాంతానికి వెళ్లేందుకు అవసరమైన రోడ్లు, కరెంటు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలంటే కొన్ని లక్షల రుపాయలు ప్రభుత్వం ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇంత ఖర్చు చేసే బదులు స్థలం ఖరీదు ఎక్కువైనా లబ్ధిదారులకు అనువుగా ఉండే ప్రాంతంలో ఎందుకు ఇళ్ల స్థలాలు కొనుగోలు చేయలేదన్న ప్రశ్నకు అధికారులే జవాబు చెప్పాల్సి ఉంటుంది. తమ ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని అనువైన చోట ఇళ్ల స్థలాలు కేటాయించాలని మణికుమారి, సుజాత, జ్యోతి, కుమారి కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే చలో విజయవాడ

విఒఎల ధర్నాతో దద్దరిల్లిన కలెక్టరేట్

ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న యానిమేటర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్ కుమారి

ప్రజాశక్తి - భీమవరం

డ్వాక్రా యానిమేటర్లు, ఆర్‌పిలు తమ సమస్యలు పరిష్కరించాలని కదంతొక్కారు. కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే చలో విజయవాడకు తరలివస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి యానిమేటర్లు వందలాది మంది తరలి వచ్చారు. కలెక్టరేట్ ప్రాంగణంలో బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలని చేసిన నినాదాలతో కలెక్టరేట్ హోరెత్తింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.అజయ్‌కుమారి మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక డ్వాక్రా గ్రూపులను, వాటిపని చూసే గ్రామ సంఘాలను, యానిమేటర్లను గాలికొదిలేశారని విమర్శించారు. రూ.10 వేల వేతనం అందించాలని, ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ ఎనిమిది వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. కాలపరిమితి సర్క్యులర్ పేరుతో యానిమేటర్లను, ఆర్‌పిలను బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. తక్కువ గ్రూపులు ఉన్నాయనే పేరుతో వేతనాన్ని ఎగ్గొట్టడం, విఒఎలను కలిపేసి కొంతమందిని తొలగించాలని చూడడం దారుణమన్నారు. తక్షణం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శ్రామిక మహిళ జిల్లా నాయకురాలు డి.కళ్యాణి, సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ డ్వాక్రా యానిమేటర్లు, పట్టణాల్లో ఆర్‌పిలు గ్రామ, వార్డు సంఘాలను ఏర్పాటు చేసి వారికి ప్రభుత్వ పథకాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం సేకరణ, రుణాలు, ఉపకారవేతనాలు అందించడంలో, లబ్ధిదారులను ఎంపిక చేయడంలో బాధ్యత వహిస్తున్నారన్నారు. ప్రభుత్వం పెట్టే సభలకు జనాన్ని తరలించడంలో, ఓట్లు వేయించడంలో కృషి చేస్తున్నారన్నారు. అయినప్పటికీ యానిమేటర్లను, ఆర్‌పిలను ఈ నాలుగున్నరేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. తక్షణం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చలో విజయవాడకు పిలుపునిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్లోకి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ ఎఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గోవిందమ్మ, పద్మావతి, ఝాన్సీ, కళ్యాణ జ్యోతి, గడ్డం లక్ష్మి, పసుపులేటి రత్నకుమారి, కట్ట నాగలక్ష్మి, అమరావతి, రాజేశ్వరి, దుర్గ లక్ష్మీపార్వతి, పద్మకుమారి, సుధారాణి, భారతి పాల్గొన్నారు.

గృహ ప్రవేశాలు చేయకుండానే శ్లాబ్‌లకు లీకేజీలు

నివాసం ఉండలేక వెనుదిరుగుతున్న లబ్ధిదారులు

ఊసేలేని పాఠశాల, వాటర్ ప్లాంట్, శ్మశానం

సిపిఎం బృందం పరిశీలనలో వాపోయిన టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు

మౌలిక వసతులు కల్పించాలి: సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

శ్లాబును పరిశీలిస్తున్న బలరాం, నేతలు

ప్రజాశక్తి - భీమవరం

పట్టణ పరిధిలో 82 ఎకరాల్లో నిర్మించిన టిడ్కో ఇళ్లు పేదలు గృహప్రవేశం చేయకుండానే శ్లాబ్‌లు లీక్ అవుతూ, పెచ్చులూడిపోతున్నాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టి పేదలకు అప్పగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం బృందం మంగళవారం టిడ్కో ఇళ్లను పరిశీలించింది. ఈ సందర్భంగా బలరాం మాట్లాడారు టిడ్కో ఇళ్లలో మౌలిక వసతులు లేవని, రెండుపూటలా తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వర్షానికి శ్లాబులు లీకై కారిపోతూ పెచ్చులూడుతున్నాయని, దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని చెప్పారు. సుమారు వెయ్యి కుటుంబాలు ప్రస్తుతం ఈ ఇళ్లలోకి వెళ్లారని, మౌలిక వసతులు లేకపోవడం వల్ల ఆర్థికంగా భారమైనా తిరిగి అద్దె ఇళ్లకు వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు స్కూల్ లేదని, వాటర్‌ప్లాంట్, శ్మశానం వంటి కనీస సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమన్నారు. అనేక సంవత్సరాలుగా పేదలు పోరాడుతున్నా పేదలకు ఇళ్లు అందించకపోవడం దారుణమన్నారు. ఒకపక్క పెరుగుతున్న ధరలు, మరోపక్క ఇంటి అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిచ్చిమొక్కలు పెరిగి పాములు వస్తున్నాయని లబ్ధిదారులు భయపడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి లబ్ధిదారులందరికీ టిడ్కో ఇళ్లు అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ బృందంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, నాయకులు ఎం.వైకుంఠరావు, కె.కృష్ణ, డి.నాగు, డి.త్రిమూర్తులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, లబ్ధిదారులు శ్రీను, కృష్ణ, మావుళ్లు, మద్దాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని..
మున్సిపల్ స్కూల్ స్వీపర్ల ధర్నా

ధర్నా చేస్తున్న మున్సిపల్ స్కూల్ స్వీపర్లు

ప్రజాశక్తి - తణుకు రూరల్

మున్సిపల్ స్కూల్ స్వీపర్ల బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఇఒ మురళి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ మున్సిపల్ స్కూళ్లలో అనేక సంవత్సరాల నుంచి పని చేస్తున్న స్వీపర్స్‌కు నేటికీ రూ.4,000 ఇవ్వడం అన్యాయం అన్నారు. ఏ ప్రజాప్రతినిధి అయినా రూ.4000 వేలతో బతకగలరా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శారద, కె.సత్యవతి, జె.బంగారమ్మ, నాసరి అర్జునమ్మ, బళ్ల ఆదిలక్ష్మి, సీతామహాలక్ష్మి, పెద్దిరెడ్డి ఎ.సత్యవతి, దేవిరెడ్డి సూర్యకుమారి, పి.ధనలక్ష్మి, కె.రామలక్ష్మి పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల సవరణ

ఆచంట: ఓటర్ల సవరణ ప్రక్రియ పారదర్శంగా జరగాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆచంట, పోడూరు, పెనుగొండ, పెనుమంట్ర మండలాలకు సంబంధించి తహశీల్దార్లు, విఆర్‌ఒలు, బిఎల్‌ఒలతో ఓటర్ల సవరణ ప్రక్రియ తొలగింపులు, మార్పులు, చేర్పులపై జెసి సమావేశం నిర్వహించారు. ఇందుకు సంబంధించిన రిజిస్టర్లు, కంప్యూటరు డేటాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1,500 మంది కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్ పరిధిలో కొత్త పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబరు నెలాఖరు నాటికి పోలింగ్ కేంద్రాల పునర్విభజన కార్యక్రమం పూర్తిచేయాల్సి ఉందన్నారు. నియోజకవర్గంలో 186 పోలింగ్ స్టేషన్లు క్షేత్రస్థాయిలో మరోసారి తనిఖీ చేసి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని తహశీల్దార్లను జెసి ఆదేశించారు.సమావేశంలో ఇఆర్‌ఒ, డ్వామా పీడీ ఎస్‌టివి.రాజేశ్వరరావు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

పెనుమంట్రలో ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు

సమస్యలు పరిష్కరించాలని నల్ల రిబ్బన్లతో ఆశాల ధర్నా

ప్రజాశక్తి - పెనుమంట్ర

హర్యానా రాష్ట్రంలోని ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ నిర్బంధాన్ని ఆపాలని సిఐటియు ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దిగుపాటి జ్యోతి అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో ఆశా డే సందర్భంగా ఆల్ ఇండియా ఆశా యూనియన్ పిలుపు మేరకు మార్టేరు పిహెచ్‌సి వద్ద మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల రెబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దిగుపాటి జ్యోతి మాట్లాడుతూ హర్యానా ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఆగస్టు 8 నుండి జరుగుతున్న శాంతియుత సమ్మెకు ప్రభుత్వాలు అనేక ఆటంకాలు కలిగిస్తూ నాయకత్వంపై నిర్బంధాలు, అరెస్టులు చేయడం మానవ హక్కులను కాల రాయడమేనని విమర్శించారు. సమ్మెలో పాల్గొంటున్న ఆశా వర్కర్లను పోలీసు వ్యానుల్లో ఎక్కించి దౌర్జన్యంగా రోజంతా కనీసం తాగునీరు, వసతులు కూడా కల్పించకుండా మహిళలను అత్యంత దుర్మార్గంగా వేధించడం పట్ల ఆశా వర్కర్స్ యూనియన్‌గా ఖండిస్తున్నామని తెలిపారు. హర్యానా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, సమ్మెకు యూనియన్ సంఘీభావం తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడర్లు లక్ష్మీ దుర్గ, పి.రత్నకుమారి, కె.కనకదుర్గ, పార్వతి, నాగలక్ష్మి, శ్రీదేవి, గంగారత్నం, భవాని, సుశీల పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : హర్యానాలో ఆశా వర్కర్లపై జరిగిన లాఠీఛార్జికి నిరసనగా లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చింతపల్లి లక్ష్మి మాట్లాడుతూ హర్యానాలో అక్కడి ప్రభుత్వం ఆశాలపై విచక్షణా రహితంగా లాఠీఛార్జి చేయడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు సిహెచ్ లక్ష్మి, ఎ.శ్యామలాంబ, కె.కృపామేరీ, విజయదుర్గ, కె.ముణికుమారి, డి.నాగమణి, నిర్మల కుమారి పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : హర్యానాలో ఆశా వర్కర్లపై జరిగిన లాఠీఛార్జికి నిరసనగా స్థానిక ఎన్‌టిఆర్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద ఆశాలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము మాట్లాడుతూ హర్యానా ప్రభుత్వం అక్కడ ఆశాలపై విచక్షణా రహితంగా లాఠీఛార్జీ చేయడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు కవిత, జ్యోతమ్మ, రత్న కుమారి పాల్గొన్నారు.

నరసాపురంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక బస్‌స్టాండ్ సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమయ్యాయని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ పేద సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారాలు మోపుతున్నాయన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అరికట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పొన్నాడ రాము, మంచిలి నీలకంఠం, నోముల కొండ, బోడసింగ్ అప్పారావు, తాడి నాగభూషణం, కొరాడ బద్రి, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెనుగొండ : నిత్యావసర వస్తువుల టోకు మార్కెట్‌పై కేంద్ర ప్రభుత్వం పరిమితులు ఎత్తివేయడంతో ధరలు అడ్డూ అదుపూ లేకుండా పెరిగిపోతున్నాయని సిపిఎం మండల కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు చినమల్లం గ్రామ పంచాయతీ కార్యదర్శి నరసింహంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధరలను అదుపు చేసే శక్తి మోడీ ప్రభుత్వం కోల్పోయిందని విమర్శించారు. రాష్ట్రంలో పెరిగిపోతున్న విద్యుత్తు ఛార్జీలను, ధరలను అదుపు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బందర్తి నరసింహమూర్తి, గుబ్బల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

దొడ్డిపట్ల సర్పంచిగా ప్రమీలాకుమారి

ప్రజాశక్తి - యలమంచిలి

ఇటీవల జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో మండలంలోని దొడ్డిపట్ల గ్రామ సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికైన చెల్లుబోయిన ప్రమీలాకుమారి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. గతంలో సర్పంచిగా పనిచేసిన ఆమె భర్త చెల్లుబోయిన నరసింహారావు (పండు) మృతి చెందడంతో అనివార్యమైన ఈ ఉప ఎన్నికలో గ్రామస్తులంతా కలిసి పార్టీలకతీతంగా ప్రమీలను సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమెను వైసిపి మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు, ఎంపిపి రావూరి వెంకటరమణ బుజ్జి, సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ అభినందించారు.

పాలకొల్లులో శ్రీవారి కళ్యాణోత్సవం నిర్వహించాలని వినతి

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రముఖ పంచారామ క్షేత్రమైన పాలకొల్లులో తిరుమల శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించాలని టిటిడి సభ్యులు మేకా శేషుబాబు టిటిడి ఛైర్మన్ కరుణాకర్ రెడ్డిని కోరారు. తిరుమలలో మంగళవారం టిటిడి కొత్త బోర్డు సభ్యుల తొలి సమావేశం అనంతరం శేషుబాబు ఛైర్మన్‌కు వినతిపత్రం అందించారు. పాలకొల్లులో గత 30 ఏళ్లుగా గోవిందమాల భక్తులు శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణం గోదావరి జిల్లాల స్థాయిలో ఘనంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. దీనికి ఆర్థిక సహాయం చేయాలని కూడా కోరారు. దీనికి ఛైర్మన్ సానుకూలంగా స్పందించారు. ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పాలకొల్లులో శ్రీవారి ఉత్సవ విగ్రహాలతో కళ్యాణం ఎప్పుడూ జరగలేదని శేషుబాబు ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు.

పింఛన్లను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ఆచంట

ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిపుష్టి సాధించాలని ఎంపిపి సూర్యకుమారి, జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు అన్నారు. నూతనంగా మంజూరైన పెన్షన్లను వల్లూరు పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచి నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు అధ్యక్షతన లబ్ధిదారులకు మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి తాళం శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు సుబ్బారావు, ఉప సర్పంచి గెద్దాడ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి జివివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పోడూరు :మండలంలోని గుమ్మలూరు గ్రామ సచివాలయం పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు, ఎంపిపి సబ్బితి సుమంగళి మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గొట్టుముక్కల సోనియారాణి, గ్రామ అధ్యక్షులు అల్లూరి తిమ్మరాజు, ఎంపిటిసి సభ్యులు అంబటి సుధాకర్, పోతాబత్తుల లక్ష్మీదుర్గ, గ్రామ ఉప సర్పంచి అల్లూరి గీతవాణి, వైసిపి నాయకులు నెలపూడి సురేష్, కృష్ణ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆచంట

పట్టణ ప్రాంతాలకు ధీటుగా గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. కొడమంచిలి పంచాయతీ పరిధి చినపేట, సుబ్బారాయుడు ఆలయ వీధి, సచివాలయం వీధి, జక్కంశెట్టి వారిపాలెం, బండివారిపాలెం చింతలతోట ఏరియాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు సహకారంతో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలం కేటాయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, వైసిపి నాయకులు బాలం నాగేశ్వరరావు, గుత్తుల సత్తిపండు, నాగరాజు, జక్కంశెట్టి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి : ఎడిఎ శ్రీనివాస్

ప్రజాశక్తి - ఉండి

పంట నమోదు తప్పనిసరని ఆకివీడు ఎడిఎ కెఎఎస్ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఉండి రైతు భరోసా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతులకు రైతు భరోసా పథకంలో భాగంగా సెప్టెంబర్ ఒకటో తేదీన వారి ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాలో రూ.7500 జమ చేసినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ పంట నమోదు చేసుకోవడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు అర్హులవుతారన్నారు. పంట నమోదు చేయించుకొని రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ఇ-కెవైసి చేయించుకోవాలని సూచించారు. అనంతరం భీమవరం జల వనరుల కేంద్రం ఎడిఎ రామలింగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి చేలకు వచ్చే తెగుళ్ల వాటి సస్యరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. మండల పరిధిలో ఇటీవల సార్వా పంటలో ఎక్కువ శాతం ఎంటియు-1318 రకం ధాన్యాన్ని ఊడ్చారని తెలిపారు. అటువంటి చేలల్లో ఎక్కువగా ఆకు ఎండు తెగులు వచ్చిందని చెప్పారు. పురుగుమందులో కాపర్ హైడ్రాక్సైడ్ మందును కలిపి పిచికారీ చేయడం ద్వారా ఆకు ఎండు తెగులును నివారించవచ్చని ఆయన సూచించారు.

నేరాలు - ఘోరాలు

హెల్త్ అసిస్టెంట్‌పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు

వీరవాసరం :మండలంలోని తోకలపూడి గ్రామంలో హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శిరిగినీడి సాయిసూర్యారావుపై మత్స్యపురిలో ఎఎన్ఎంగా పని చేస్తున్న జి.సంధ్యారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరవాసరం పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వీరిరువురు వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పని చేస్తున్నట్లు తెలిపారు. సాయి సూర్యారావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉంటూ తనను కులం పేరుతో దూషిస్తూ ఉన్నతాధికారులతో మెమోలు ఇప్పిస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతూ మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని సంధ్యారాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

సమాజానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులు

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ఆదర్శ గురువులకు అవార్డులు

రాష్ట్రస్థాయి అవార్డుతో రాజమౌళి కోటేశ్వరస్వామి

ప్రజాశక్తి - కాళ్ల

ఆదర్శ గురువులు అవార్డులు సొంతం చేసుకున్నారు. కాళ్ల మండలంలో పని చేస్తున్న 11 మంది ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సీసలి స్పెషల్ ప్రాథమిక పాఠశాల ఎస్‌జిటి ఉపాధ్యాయుడు బొబ్బిలి రాజమౌళి కోటేశ్వరస్వామి విశాఖపట్నంలో ఎయు కాన్వొకేషన్ హాలులో మంగళవారం జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా అందుకున్నారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును నలుగురు ఉపాధ్యాయులు అందుకున్నారు. మరో ఆరుగురు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. అంకితభావంతో పని చేస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న పెదఅమిరం మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు డి.ప్రసన్నభారతి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కలెక్టర్ పి.ప్రశాంతి, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, భీమవరం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ చేతులమీదుగా అందుకున్నారు. వేంపాడు (హిందూ) ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బెల్లంకొండ నాగ మురళి శ్రీనివాసరావు, బొండాడ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయురాలు కె.విజయశ్రీ, వేంపాడు ప్రాథమిక పాఠశాల (ఎల్ఇ) ప్రధానోపాధ్యాయులు విఆర్‌కె.రవికుమార్‌రాజు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో ఆచార్యునిగా పని చేస్తున్న కడలి పూర్ణిమ శర్మకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా పూర్ణిమను కళాశాల పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు, ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకరరావు, టెక్నికల్ డైరక్టర్ అప్పారావు, డీన్‌లు డాక్టర్ రాంబాబు, డాక్టర్ నరేష్, వివిధ ఇంజినీరింగ్ విభాగాల అధిపతులు అభినందించారు. దేశ ప్రగతిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందని ఎపి నిట్ డీన్ రీసెర్చ్, కన్సల్టెన్సీ డాక్టర్ జిఆర్‌కె.శాస్త్రి తెలిపారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్ రెడ్డి పర్యవేక్షణలో సంస్థ ప్రాంగణంలోని పరిపాలనా భవనం వద్ద ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థుల భవితవ్యాన్ని తీర్చిదిద్దటంలో తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులదేనన్నారు. డీన్‌లు డాక్టర్ టి.కురుమయ్య, డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్ మాట్లాడారు. తొలుత రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గణపవరం : మానవత సంస్థ భీమవరం శాఖ ఆధ్వర్యంలో గణపవరం కన్యకా పరమేశ్వర ఉత్సవం సందర్భంగా నిర్వహించిన ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో మానవత సంస్థ అభివృద్ధి విస్తరణ కమిటీ కన్వీనర్ సాగిరాజు జానకిరామరాజు పాల్గొని మాట్లాడారు. తొలుత పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎంఆర్.రాజు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రార ంభించారు. అనంతరం ఉపాధ్యాయులు న డపన నాగేశ్వరరావు (విస్సాకోడేరు), కాకర్ల రాజేశ్వరి (ఆకి వీడు), కెవిబి. మరళీకృష్ణ (భీమ వరం), సిబిసి శేఖర్‌రాజు, డివి ఎస్.చంద్రాజిలను స త్కరించా రు. పిప్పర గ్రంథాలయంలో సర్వే పల్లి రాధాకష్ణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి డాక్టర్ కె.ప్రియా ఒక సర్వేపల్లి రాధాకష్ణ జీవిత విశేషాలు వివరించారు. అనంత రం జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యా యులను సత్కరించారు. గణపవరం డిగ్రీ కాలేజీలో ప్రిన్సి పల్ పి.నిర్మలాకుమారి అధ్యక్షతన సభ నిర్వహించారు. చాణక్య కాలేజీలో విద్యార్థులకు లియో క్లబ్ ఆధ్వర్యాన వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కాశిపాడులో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు.



రాష్ట్రస్థాయి అవార్డు అందుకుంటున్న పూర్ణిమశర్మ

వీరవాసరం : వీరవారం ఎంఆర్‌కె.జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అవార్డు పొందిన పీడీ మల్లేశ్వరావు దంపతులను ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాస్‌ను, జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పాఠశాల ఉపాధ్యాయులు పంపన సాయిబాబు, కుసుమే ఆనందరావు, వై.వెంకటేశ్వరావు, వై.భానుకుమారి, బి.విజయలక్ష్మి, రత్నరాజు, చినబాబు, పెద్దిరాజు, నరసింహరావు, శివకుమార్, పుష్పలత, సుబ్రహ్మణ్యంలను విద్యార్థులు సత్కరించారు. రాయకుదురు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు కానుకొలను శ్రీనివాసరావును, ఉపాధ్యాయులను సత్కరించారు.

పెనుమంట్ర:సర్వేపల్లి రాధాకృష్ణన్ అడుగుజాడల్లో నడవడమే తమ లక్ష్యమని ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఎంఇఒ కార్యాలయం వద్ద సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి, ఎఎస్ఐ వెంకటేశ్వరావు, మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు వైసిపి కార్యాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి వైసిపి ఇన్‌ఛార్జి గుడాల గోపీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఆదర్శ ఉపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్, ఉన్నమట్ల చిన్నయ్యలను ఆయన ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులుగా ఉండాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దల గణేష్‌భవాని అన్నారు. పాలకొల్లు జివిఎస్‌వి మున్సిపల్ స్కూలులో గురుపూజోత్సవం సందర్భంగా మంగళవారం పాఠశాలలోని ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు త్రిమూర్తులు, శశికళ, చంద్రకళ, భవానిదుర్గ, హెచ్‌ఎం రాయపూడి భవానిప్రసాద్ పాల్గొన్నారు.

ఆకివీడు :జాతి ఔన్నత్యాన్ని పెంపొందించడంలో ఉపాధ్యాయులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని, అందుకు పునాదులు వారేనని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్, డాక్టర్ ఎంవి.సూర్యనారాయణరాజు అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ ఆఫ్ ఆకివీడు, ఆదర్శ లయన్స్ క్లబ్, గోల్డెన్ ఆక్వా లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుని ఎంపిక చేసి సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు వివి.కృష్ణంరాజు అధ్యక్షతన నిర్వహించిన సభలో సూర్యనారాయణరాజు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులు మంచెం రాధాకృష్ణ, అడపా సుబ్రహ్మణ్యం, గోనుగుల మాల్యాద్రి, జెడ్‌వి.సత్యనారాయణ, టి.సత్యకుమారి, ఎ.పాండురంగారావులను సన్మానించారు.

ఉపాధ్యాయులు ఉత్తమ మార్గాలను అనుసరించాలని, విద్యార్థులు అనుకరిస్తారని డిఇఒ రమణ అన్నారు. స్థానిక సూఫీ కళ్యాణ మండపంలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఒ రవీంద్ర అధ్యక్షతన నిర్వహించిన సభలో డిఇఒ రమణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణ సర్వేపల్లిని ఆ స్థాయికి తీసుకెళ్లాయన్నారు. తహశీల్దార్ ఎం.విజయలక్ష్మి మాట్లాడారు. కాళ్ల, ఆకివీడు మండలాల ఉత్తమ గురువులను సన్మానించారు.

ఉండి: మండల పరిధిలోని పాందువ్వ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల కార్యదర్శి మాదాసు గోపీ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపీ, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా అడ్‌హక్ కన్వీనర్ అరివెల్లి బలరాముడు మాట్లాడారు. అనంతరం గోపి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యులు రాజు పర్యవేక్షణలో ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో దవిలి అప్పన్న, ఎస్.గంగయ్య, ఎం.శ్రీరాములు, జి.కాసులు పాల్గొన్నారు.

ఉండి : మండల పరిషత్ ఆధ్వర్యంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అధ్యక్షతన మండల పరిధిలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు పులిదిండి సత్యం మాట్లాడారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఎం.శివరామరాజు, డి.కుమార్‌స్వామి, డి.రాజేష్, బి.వెంకటఉమాదేవి, కె.శ్రీలక్ష్మి, ఆర్.అన్నమ్మ, జి.విజయలక్ష్మిలను సన్మానించారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు జిబి.ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించారు.

నరసాపురం టౌన్ : స్థానిక మిషన్ హైస్కూలులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులకు మెమెంటో, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, ఉపాధ్యాయులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వీరవాసరం పిహెచ్‌సిలో పరిణామాలపై విచారణ

విచారిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ భానునాయక్

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోటు చేసుకున్న పరిణామాలపై జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ఒ భానునాయక్ మంగళవారం విచారణ చేశారు. ముఖ్యంగా హెల్త్ అసిస్టెంట్ శిరిగినీడి సాయిసూర్యారావు ఎఎన్ఎంల పట్ల వ్యవహరించిన తీరుపై ఆయన ఆరా తీశారు. కొన్నిరోజుల క్రితం తమ పట్ల సాయిసూర్యారావు అభ్యంతరకరంగా వ్యవహించాడంటూ ఎఎన్ఎం ఇ.సంధ్యారాణితో పాటు మరి కొంతమంది సచివాలయ ఎఎన్ఎంలు డిఎంహెచ్ఒకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్ఒ విచారణ చేపట్టి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో ఎవరికి ఎవరి వల్ల ఎటువంటి ఇబ్బంది ఎదురైందో రాతపూర్వకంగా ఇస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిబంధనలను పక్కనపెట్టి చోటు చేసుకున్న పరిణామాల పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరి పరిధిలో వారు విధులు నిర్వర్తించాలన్నారు. సక్రమంగా విధులు నిర్వర్తించనివారిపై చర్యలు తప్పవన్నారు. లెప్రసీ సెంటర్‌లో పని చేస్తున్న వైద్య సిబ్బందిని ఆదర్శంగా తీసుకుని పని చేయాలన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా సాయిసూర్యారావును ఆరోగ్య కేంద్రంలో ఏ అధికారంతో నియమించారంటూ వైద్యులు సత్యనారాయణరాజును ప్రశ్నించారు. దళిత ఉద్యోగుల పట్ల వ్యవహరించే తీరులో తేడా వస్తే సహించేదిలేదని దళిత నాయకుడు కోరం ముసలయ్య హెచ్చరించారు. అధికారుల మద్దతుతోనే సాయి సూర్యారావు కొంతమందిపై దురుసుగా ప్రవర్తించాడంటూ ఆరోపించారు. తప్పనిసరిగా అతనిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను కోరారు.

రీ సర్వే ప్రణాళికబద్ధంగా నిర్వహించాలి : జెసి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ప్రణాళిక బద్ధంగా భూముల రీ సర్వే నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో శాశ్వత భూ హక్కు భూ రక్షణపై తహశీల్దార్, డిటి, మండల సర్వేయర్లు, విఆర్‌ఒలకు, విలేజ్ సర్వేయర్లకు ఒక రోజు వర్క్‌షాపు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రీ సర్వేలో రైతులు భాగస్వాములుగా ఉండాలన్నారు. శాటిలైట్ బేస్‌తో సర్వే చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి, నరసాపురం ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ కె.కృష్ణవేణి, జిల్లా సర్వే అధికారి కె.జాషువా పాల్గొన్నారు.

రీ సర్వేతో ఎన్నో ఉపయోగాలు

పాలకోడేరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని గొల్లలకోడేరు పంచాయతీ ఉపసర్పంచి కలిదిండి శ్రీనివాస్‌వర్మ అన్నారు. గొల్లలకోడేరులో ఇటీవల రీ సర్వే పూర్తి కావడంతో సరిహద్దుల్లో సర్వే రాళ్లను భూమిలో పాతే కార్యక్రమాన్ని మంగళవారం శ్రీనివాస్ వర్మ ప్రారంభించి మాట్లాడారు. సుమారు వందేళ్ల క్రితం రీ సర్వే జరిగిందని, అప్పటినుంచి ఏ ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టలేదన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ వేంద్ర, వేంద్ర అగ్రహారం, పాలకోడేరు, గొరగనముడి, గొల్లలకోడేరు గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందన్నారు. వేంద్ర మినహా మిగిలిన గ్రామాలకు సర్వే రాళ్లు అందుబాటులో ఉన్నాయని, వీటిని సరిహద్దుల్లో పాతే కార్యక్రమాలను చేపట్టనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒ ఇందిర, గ్రామ సర్వేయర్, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకోడేరు : సర్వే రాయిని పాతుతున్న ఉపసర్పంచి శ్రీనివాస్‌వర్మ

తొలగించిన ఓట్లను త్వరగా పున:పరిశీలించాలి

జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

తొలగించిన ఓట్లను త్వరగా పున:పరిశీలించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. తహశీల్దార్, బిఎల్‌ఒలు, సూపర్‌వైజర్స్‌తో ఓటర్ల సవరణపై సమీక్ష సమావేశం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు జారీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ, ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ కె.కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, నరసాపురం తహశీల్దార్ మౌలానా అబ్దుల్ ఫాజిల్, ఎలక్షన్ డిటి నాగదేవి పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పున:పరిశీలన తప్పనిసరి

పాలకోడేరు : తొలగించిన ఓటర్లను తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పున:పరిశీలించాలని ఓటర్ల నమోదు నియోజకవర్గ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు సూచించారు. పాలకోడేరు తహశీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితా సవరణపై అధికారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఓటర్ల జాబితాపై పలు సూచనలు, సలహాలు అందించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ లోపు పెండింగ్ క్లయిమ్‌ను పరిష్కరించాలన్నారు. మరణించిన ఓటర్ల తొలగింపును ఏడు రోజుల వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. ఇంటింటి సర్వే నివేదికను బిఎల్‌ఒల వారిగా అందించాలన్నారు. తొలగించిన ఓట్ల వెరిఫికేషన్‌ను ఈ నెల ఏడో తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు ఎంపిడిఒ మురళి గంగాధరరావు, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణరాజు, విఆర్‌ఒలు, సచివాలయ ఉద్యోగులు, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న జెసి రామ్‌సుందర్‌రెడ్డి

'నాడు-నేడు' పనులు త్వరగా పూర్తి చేయాలి

పెనుమంట్ర :నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ వి.పూర్ణ బాబ్జి ఆధ్వర్యం లో నాడు-నేడు పనులకు సంబంధించిన వారాంతపు రివ్యూ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రికార్డుల పరంగా చేయాల్సిన చోట పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తి చేయాలన్నారు. పంచాయతీ రాజ్ ఎఇ సత్తి నాగిరెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'బిసిలందరం జగన్‌కు రుణపడి ఉంటాం'

ప్రజాశక్తి - ఉండి

అత్యంత ప్రతిష్టాత్మకమైన తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యునిగా బిసి సామాజిక తరగతికి చెందిన మేకా శేషుబాబును నియమించడం పట్ల ఉండి బిసి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఉండిలో మంగళవారం వైసిపి సీనియర్ నాయకులు బడుగు బాలాజీ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. నామినేటెడ్ పదవుల్లో బిసిలకు ప్రాధాన్యతనిస్తున్న సిఎం జగన్‌కు బిసిలందరూ రుణపడి ఉంటారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉండి నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి పివిఎల్.నరసింహరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించి సిఎం జగన్ రుణం తీర్చుకుంటామన్నారు. బడుగు బలహీన వర్గాలను తెలుగుదేశం పార్టీ వంచిస్తుందని ఆ పార్టీ మండల నాయకులే బాహాటంగా చెబుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వీరమల్లు మల్లేశ్వరరావు, మాసగాని వెంకట్రావు, కోరసిక వెంకటకుమార్, జోగి దుర్గారావు, అంగర సునీల్, షేక్ కన్నాసాహెబ్, చిట్టిబొమ్మల సతీష్, మోహన్ పాల్గొన్నారు.

'వైసిపి విజయానికి కృషి చేయాలి'

ప్రజాశక్తి - మొగల్తూరు

వైసిపి విజయానికి యువత శక్తివంచన లేకుండా కృషి చేయాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. మొగల్తూరులోని లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన మండలం యువజన విభాగ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత బైక్ ర్యాలీ నిర్వహించారు. అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

వైసిపితోనే మహిళా సాధికారత : చీఫ్ విప్

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

మహిళా సాధికారత, ఆర్థిక అభివృద్ధి వైసిపితోనే సాధ్యమని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. స్థానిక మండల సమాఖ్య భవనంలో మంగళవారం డ్వాక్రా మహిళలకు నాలుగో విడత వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ ప్రసాదరాజు 1905 గ్రూపులకు రూ.2.64 కోట్ల విలువైన నమూనా చెక్కును సమాఖ్య ప్రెసిడెంట్లకు, విఒలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, కడలి రాంబాబు, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు అంద్రాజు చల్లారావు, చినిమిల్లి చంద్రశేఖర్, మైలబత్తుల శ్రీను, ఎపిఎం పిప్పళ్ల పద్మ, మండల సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

ప్రజాశక్తి - పెనుగొండ

గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయకుమారి అన్నారు. మండల కేంద్రమైన పెనుగొండ శివారు చిన్నంవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమారి మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనతను అధిగమించొచ్చని, పిల్లలు ఆరోగ్యంగా, చురుకుగా ఎదుగుతారని చెప్పారు.

పలుగ్రామాల్లో 'మహాశక్తి'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని ఆగర్తిపాలెం, వెలివెల గ్రామాల్లో మంగళవారం మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నేతలు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. వారి అభ్యున్నతికి మినీ మేనిఫెస్టోలో అనేక పథకాలు రూపొందించారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు కర్నేని రోజారమణి, మండల మహిళా అధ్యక్షురాలు ద్రాక్షారపు జ్యోతి, పాల విజయకుమారి, తాళ్లూరి విజయలక్ష్మి, గుడాల సత్యవాణి, పరువు సుజాత, సత్యవతి, లక్ష్మీజ్యోతి, గూడూరి భవాని, సంగుల విజయలక్ష్మి, వరలక్ష్మి, వెంకటరమణ పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని వినతి

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎస్‌సి వర్గీకరణ బిల్లు ఈ నెలలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో పెట్టాలని, ఇందుకు టిడిపి నుంచి మద్దతు ఇవ్వాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా కన్వీనర్ పసుపులేటి చినబాబు కోరారు. ఈ మేరకు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడుకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ నెల 18వ తేదీ నుంచి 22 వరకు జరుగే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లును రాష్ట్ర ప్రతిపక్ష ఎంపీలు ప్రవేశపెట్టాలని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, ప్రతిపక్ష నేత చంద్రబాబు తమ ఎంపీల ద్వారా వర్గీకరణ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తి ఆమోదించాలని కోరారు. నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజుకు మెయిల్ ద్వారా వినతిపత్రం అందించినట్లు చెప్పారు.

దస్తావేజు పోయినది

నల్లంటి ఇందిరా ప్రియదర్శిని, D/o. సుబ్బారావు అను నేను తెలియజేయునది ఏమనగా, నా పేరున జంగారెడ్డిగూడెం S.R.O నందు ది. 24-10-2011 న Doc. No. 8606/2011 గా రిజిస్ట్రేషన్ చేయబడిన దస్తావేజు ది. 10-8-2023న టి.నరసాపురం మెయిన్ సెంటర్ నుండి తహశీల్దార్ కార్యాలయమునకు వచ్చే మార్గమధ్యలో పడిపోయినది. దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

నల్లంటి ఇందిరా ప్రియదర్శిని
D/o. సుబ్బారావు, H.No. 23-16
సిప్రియన్‌పేట, చింతలపూడి
సెల్: 79897 68382

విక్రయ దస్తావేజు పోయినది

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, వడ్లమాను గ్రామానికి చెందిన పందేటి నరశింహులు గారి కుమారుడు పందేటి జయబాబుకు చెందిన ఆర్.యస్. నెం. 349/5రు దాఖలా య. 0.05 -1/2 సెంట్లు నివేశన స్థలానికి సంబంధించిన విక్రయ దస్తావేజు (నెం. 5494/2011) ఒరిజినల్ పోయినది. ఆచూకీ తెలిసినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియపర్చగలరు.

పందేటి జయబాబు
S/o. నరశింహులు
వడ్లమాను గ్రామం, ఆగిరిపల్లి మండలం
ఏలూరు జిల్లా
సెల్: 7729807928

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS :: GUNTUR
Dispute No.109/2022

Between :
M/s.Margadarsi Chit Fund Pvt.Ltd., Market Centre, Guntur. .... Disputant
And
Mr.P.Ignatius and Others .... Opponents
To
OPP. NO.5: MR.PUTCHAKAYALA BALA SUNDARA RAO, S/O. P.VENKATESWARLU, RES:D.NO.10-41-1, BESIDE BYPASS ROAD, NEAR RCM CHURCH, TANUKU, WEST GODAVARI DIST – 534 211.

Please take notice that the above dispute is filed against Opponent No.5 for Recovery of Rs.76,997/- (Rupees Seventy Six Thousand Nine Hundered and Ninty Seven Only) and the same is posted to Dt.26-09-2023 for the appearance of you before the Deputy Registrar of Chits O/o District Registrar, Guntur at 10:30 a.m. If you fail to attend the office of Deputy Registrar of Chits on that day the matter will be heard and decided exparte basis on the material available.

(By order of the Deputy Registrar of Chits)
Foreman / Branch Senior Manager,
Margadarsi Chit Fund Pvt, Ltd.,
Market Centre, Guntur.